క్లుప్తంగా

ప్రతి గురువారం 104 శిబిరం

మాకవరపాలెం: మండల కేంద్రంలోని నిర్వహించిన వైద్య శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు చేశారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలో గురువారం 104 వాహనంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ అల్లంపల్లి శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సీతా రామలక్ష్మి సుగర్, బిపి, సాదారణ వ్యాధులతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులు అందజేశారు. ఇకపై ప్రతి గురువారం 104 శిబిరం నిర్వహిస్తామని వైద్యాధికారి తెలిపారు.

మూగబోయిన ఏపీ ఫైబర్ నెట్

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయితీ వడ్డాదిలో మూడు రోజులుగా ఏపీ ఫైబర్ నెట్ సేవలు నిలిచిపోయాయి. మంగళవారం నుంచి ఏపీ ఫైబర్ నెట్ మరమ్మతులకు గురైంది. దీంతో వైఫై, నెట్, టీవీలు రాక వందలాది మంది వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం ఏపీ ఫైబర్ నెట్ సేవలు పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకు ఈ నెల 26వ తేదీ నుండి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. డిగ్రీలో సింగిల్ మేజర్ విధానంలో ఏడు గ్రూపులు ఉన్నాయన్నారు. బిఏ, హిస్టరీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిఏ పొలిటికల్ సైన్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ కెమిస్ట్రి, బీఎస్సీ ఫిజిక్స్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

భవానీ భక్తుల పాదయాత్ర



దొండపూడి నుంచి విజయవాడకు కాలినడకన వెళుతున్న భవానీ భక్తులు

రావికమతం : రావికమతం మండలం దొండపూడి నుండి విజయవాడకు సుమారు 8 మంది భవానీ భక్తులు కాలినడకన బయిలుదేరారు. వీరంతా భవానీ మాలలు వేసి దీక్షలు చేసి దేవి శరన్నవరాత్రులు సందర్భంగా కాలినడకన వెళ్లి విజయవాడ కనకదుర్గమ్మ దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటామని వారు తెలిపారు. భవానీ భక్తులు మాట్లాడుతూ వారం రోజుల వ్యవధిలో విజయవాడ చేరుకొని అమ్మను దర్శించుకుంటామని తెలిపారు.

కోళ్లకు కొక్కెర తెగులు నివారణకు టీకాలు



మాడుగులలో పెరటి కోళ్లకు టీకాలు వేస్తున్న దృశ్యం

మాడుగుల: పెరటి కోళ్లకు కొక్కెర తెగులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని పశువైద్యశాఖ ఏడీ వి. చిట్టినాయుడు అన్నారు. మండలంలో అన్ని రైతు సేవా కేంద్రంలో గురువారం 1360 కోళ్లకు కొక్కెర తెగుళ్ల నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడారు కోడి అలసటగా ఉండడం, తిండి తినకపోవడం, తల వంకరగా తిరిగి నిలబడలేకపోవడం లాంటి లక్షణాలు ఉంటే అది కొక్కెర తెగులు లక్షణాలని గుర్తించాలన్నారు. టీకాలు వేయడంతో పాటు డీవార్మింగ్, మందులు ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు.

దీన్‌దయాళ్‌కు నివాళులు

మాకవరపాలెం: పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మత్రినాయుడు, ప్రధాన కార్యదర్శి బాబూరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబు దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు జమీలు, అంజనేయులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ సర్వేయర్ శిక్షణకు దరఖాస్తులు

మాకవరపాలెం: అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. మండల కేంద్రంలో రెండు నెలలపాటు శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్, ఆపైన చదివి, 18 నుంచి 44 ఏళ్లలోపు వయసువారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9490219717 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

238 మందికి ఉచిత వైద్య పరీక్షలు

నాతవరం: మండల కేంద్రంలో సచివాలయం వద్ద గురువారం వైద్య శిబిరం నిర్వహించి 138 మంది రోగులను పరీక్షించారు. జ్వరాల నియంత్రణలో భాగంగా మండల వ్యాప్తంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని వైద్యాధికారి కె.ప్రసన్నకుమార్ తెలిపారు.

యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం

పర్యావరణానికి హానికలిగించే పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువుల నిషేధం అమలుకు నోచుకోవడంలేదు. వీటి వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. దీనిని నియంత్రించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రలో ప్లాస్టిక్ వినియోగించొద్దని చేస్తున్న ప్రచారాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు విచ్చల విడిగా విక్రయాలు జరుపడంతో పర్యావరణం కలుషితమవుతోంది.

- విచ్చలవిడిగా విక్రయాలు
- దెబ్బతింటున్న పర్యావరణం
- పట్టించుకోని అధికారులు

మాకవరపాలెం : ఏ ప్రాంతంలో చూసినా ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. కిరాణా దుకాణాల్లో వీటి విక్రయాలు బహిరంగంగానే జరుగుతున్నాయి. ప్రధానంగా హోటళ్లు, చికెన్ సెంటర్లు, చిన్న, చిన్న దుకాణాలతో పాటు సంతల్లో నిత్యం వీటి వాడకం పరిపాటిగా మారింది. ఈ ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను వినియోగించిన అనంతరం ఎక్కడ బడితే అక్కడ పారేయడంతో అవి భూమిలో కలవకుండా పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

అమలుకాని నిబంధనలు..

సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు 40 మైక్రాన్ల మందం కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాల్సి ఉంది. దీనికి విరుద్ధంగా ప్లాస్టిక్ వినియోగించే వారిపై కేసులు నమోదు చేయాలనే నిబంధన ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో వీటికి ప్రత్యామ్నాయంగా పేపర్‌తో గ్లాసులు, కవర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇవి భూమిలో కలిసిపోయినా ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిసినా వాటిని ఎవరూ వినియోగించడంలేదు. వీటి ధర ఎక్కువగా ఉందని, తక్కువకు వచ్చే పాలిథిన్ వైపే వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. దీంతో వినియోగదారులు కూడా వీటితోనే సరుకులు తీసుకెళుతున్నారు.



చెత్త కుప్పల్లో అధికంగా కనిపిస్తున్న పాలిథిన్ కవర్లు

పేరుకే ర్యాలీలు, అవగాహన సదస్సులు..

ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల విక్రయాలపై నిఘా ఏర్పాటు చేశాం. వాటిని విక్రయిస్తే జరిమానా విధిస్తామని అధికారులు చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమిత మవుతున్నాయి. ప్లాస్టిక్ విక్రయించే వారిపై అధికారులు తీసుకున్న చర్యలు ఎక్కడా కనిపించలేదు. ప్రభుత్వ ఆదేశాలతో ప్రతి నెలా గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో సైతం ప్లాస్టిక్ సంచులు వాడకాన్ని మానుకుని, గుడ్డ సంచులను వినియోగించాలని ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు సైతం పాల్గొంటున్నా... వీటిని పేరుకే తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిత్యం ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతోంది.



దుకాణాల్లో విక్రయిస్తున్న పాలిథిన్ కవర్లు

గ్రామాల్లో ఎక్కడ చెత్త కుప్పల్లో చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల విక్రయాలపై చర్యలు తీసుకుని పర్యావరణాన్ని కాపాడాలని పలువురు అంటున్నారు.

సాగుదారులకు న్యాయం చేయాలి



డీటీ నూకరాజుకు ఫిర్యాదు చేస్తున్న రాంబాబు, సాగుదారులు

మాకవరపాలెం: బంజరు భూముల సాగుదారులకు న్యాయం చేయకుంటే ఆందోళన చేస్తామని బీజేపీ నేత, పీఏసీఎస్ డైరెక్టర్ అడిగర్ల రాంబాబు స్పష్టం చేశారు. రాచపల్లి రెవెన్యూలో గల 737 సర్వే నంబర్‌లో ఉన్న భూములను రైతులు గత 40 ఏళ్లకుపైగా సాగు చేసుకుంటున్నారు. ఈ భూమిని పరిశ్రమలకు కేటాయిస్తామంటూ ఇటీవల రెవెన్యూ అధికారులు 406 ఎకరాలను సాగు చేసుకుంటున్న 469 మంది రైతులను సర్వే ద్వారా ఎంపిక చేశారు. అయితే వీటిలో సాగులో ఉన్న రైతుల పేర్లు లేవంటూ గురువారం రాంబాబుతోపాటు రామన్నపాలెం, రాచపల్లికి చెందిన అడిగర్ల రమణ, యాకా అర్జున్, మరికొందరు డీటీ నూకరాజుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ సాగులో ఉన్నతమ పేర్లు ఎంపిక చేసిన జాబితాలో లేవన్నారు. వీఆర్వో, సచివాలయ సర్వేయర్ చేపట్టిన సర్వేలో సాగుదారుల ఫొటోలను తీసి, వివరాలు నమోదు చేసినప్పటికీ జాబితాలో పేర్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి అనుకూలంగా ఉన్న వారి పేర్లను చేర్చి, సాగులో ఉన్న వారిని తప్పించారన్నారు. తమకు న్యాయం చేయకుంటే ఆందోళన చేస్తామన్నారు.

గ్రామాలు స్వచ్ఛత, సమృద్ధి సాధించాలి



మాడుగుల : మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల: గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలని ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో శిక్షణా తరగతులలో పాల్గొని ఆయన మాట్లాడారు. గ్రామాలు స్వచ్ఛత సమృద్ధి సాధించినాడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామాల్లో వనరులు సద్వినియోగం చేసుకుంటే గ్రామస్తులకు జీవనోపాధితో పాటు పేదరికంలేని గ్రామాలుగా మార్పు చెందుతాయని అన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నీటి సమృద్ధి, స్వచ్ఛ శ్రమ లాంటి విధానాలను ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్ వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాతవరం : శిక్షణ తరగతుల్లో చెప్పిన విషయాలను యధావిధిగా గ్రామ పంచాయతీల్లో అమలు చేసే బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా పంచాయతీలు అభివృద్ధికి సంబంధించి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఆశయంతో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ తరగతుల్లో తెలుసుకున్న గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో అమలు చేస్తేనే ఆశయం నెరవేరుతుందన్నారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం చేయకుండా అంకిత భావంతో పని చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో మూర్తిబాబు, జేఈలు శ్రీవేంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాత్యాయనీ అలంకరణలో కనకదుర్గ



దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో కాత్యాయనీ అలంకరణలో..



కొత్తకోట దుర్గాదేవి ఆలయంలో కాత్యాయనీ దేవి అవతారం



వంటర్లపాలెంలో కాత్యాయనిదేవిగా కనకదుర్గమ్మ

నర్సీపట్నం : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో నాలుగో రోజు గురువారం శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు కాత్యాయనీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి తరలివచ్చి పూజలు నిర్వహించారు.

రావికమతం : దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం కొత్తకోటలోని దుర్గాదేవి ఆలయంలో కాత్యాయనీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు వేపా రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాడుగుల రూరల్ : వంటర్లపాలెంలోని కనకదుర్గమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలులో కనకదుర్గమ్మను కాత్యాయనిగా ఆలంకరించినట్లు గురు భవానీ దండి నర్సింగరావు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక కుంకమ పూజలు నిర్వహించారు. ఎం.కోడూరు శివాలయంలో పార్వతీదేవిని కాత్యాయనిగా అలంకరించారు. కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అష్టలక్ష్మి కుంకుమ పూజలు జరిపారు.

బాలికలకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ

రావికమతం : విజయనగరం జిల్లాలోని వసుదైక కుటుంబ యూనువర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్(వి.కె.ఫ్యామిలీ) మేడివాడ జెడ్పీ హైస్కూల్లో చదువుతున్న తల్లితండ్రులు లేని నలుగురు బాలికలకు ఉచితంగా సైకిళ్లను అందజేసింది. ఆ సంస్థ తరపున బాలికా విద్యను ప్రోత్సహించడంలో భాగంగా విజయనగరం జిల్లా వ్యాప్తంగా పలు జెడ్పీ హైస్కూల్లో చదువుతున్న పేద వర్గాలకు చెందిన బాలికలకు ఉచితంగా సైకిళ్లను అందజేస్తుంది. మేడివాడ జెడ్పీ హైస్కూలు స్కూలు అసిస్టెంట్, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు, వీకే ఫ్యామిలీ సంస్థ కొల్లి ఈశ్వర రావును సంప్రదించి మేడివాడ హైస్కూల్లో చదువుతున్న ఆరుగురు బాలికల వివరాలతో దరఖాస్తు చేయగా వారిలో నలుగురు బాలికలకు సైకిళ్లు మంజూరు చేశారు. గోపాసిన సిరిశ్రీ,చంద్రాన కుమారి,సీతా హేమశ్రీజ,గంటా హేమశ్రీలకు రామభద్రాపురంలో ఉచితంగా సైకిళ్లు అందించారు.



వీకే ఫ్యామిలీ ఫౌండేషన్ అందించిన సైకిళ్లతో బాలికలు, ప్రత్యేక ఉపాధ్యాయులు

రోడ్లు బాగు చేయండి మహాప్రభో

కొత్తూరు జంక్షన్‌లో సీపీఎం రాస్తారోకో


చోడవరం : చోడవరం నుంచి అనకాపల్లి వెళ్లే రోడ్డుతో పాటు బి.ఎన్.రోడ్డు గోతులు పూడ్చాలని, కూలిపోయిన బ్రిడ్జిలు వెంటనే నిర్మాణం చేయాలని డిమాండు చేస్తూ. సీపీఎం చోడవరం మండల కమిటీ ఆధ్వర్యంలో కొత్తూరు జంక్షన్‌లో భారీ రాస్తారోకో నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ చోడవరం అనకాపల్లి బీఎన్ రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోతులమయమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి చలనం లేదన్నారు. మూడు జిల్లాలకు ప్రధాన రహదారిగా ఉన్న ఈ రోడ్లో విజయరామరాజుపేట వద్ద , వడ్డాది వద్ద బ్రిడ్జిలు కూలిపోయి, దారి మళ్లించి బస్సులు, వాహనదారులు వెళ్లాల్సి వస్తుందని అన్నారు. పూర్తిగా పాడయిన రోడ్లో ప్రయాణాలు చేస్తున్న వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురై గాయలపాలవుతున్నారని అన్నారు. సంక్రాంతినాటికి రోడ్లన్నీ గోతులు పూడుస్తామని చెప్పిన పవన్ కళ్యాణ్ మాటలు నీటిమూటలుగానే మిగిలాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకొని ఈ రోడ్డు పునర్‌నిర్మాణం చేయాలని కూలిన బ్రిడ్జిలు వెంటనే నిర్మించాలని, కల్వర్టుల వద్ద రక్షణ గోడలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.వి.నాయుడు, గూడూరు వరలక్ష్మి, నాగిరెడ్డి, సత్యనారాయణ, వెంకటలక్ష్మి, కృష్ణవేణి, దేవుడమ్మ పాల్గొన్నారు.



సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

కిత్తంపేటలో పశువైద్య శిబిరం

రావికమతం: మూడు నెలలు దాటిన ప్రతి పశువుకూ గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని రైతులకు విశాఖ పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామ్మోహన్‌రావు,జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సౌజన్య సూచించారు.కొత్తకోట పశు వైద్యాధికారి బాలతేజ ఆధ్వర్యంలో గురువారం కిత్తంపేటలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు.స్పెషలిస్ట్ డాక్టర్లు నూకేశ్వరరావు,సురేష్,దయమంతి,బాలతేజలతో కూడిన వైద్య బృందం పశువులకు టీకాలు వేశారు. సుమారు 120 పైగా పశువులకు టీకాలు వేసారు.67 పశువులకు ఉచితంగా గర్భకోశ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీడీవో మహేష్, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి, సర్పంచ్ పెద్దిరెడ్ల రామలక్ష్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న పశు వైద్య బృందం

సమయాన్ని సద్వినియోగం చేసుకోండి

బుచ్చెయ్యపేట : విద్యార్థులు సమయాన్ని చక్కని ప్రణాళికతో సద్వినియోగం చేసుకోవాలని దిబ్బిడి జిల్లా పరిషత్ గణిత ఉపాధ్యాయుడు ఎ.వి.ఎస్. మూర్తి తెలిపారు. దసరా సెలవులైనా బుధవారం ఆయన మండల కేంద్రం బుచ్చెయ్యపేట,కందిపూడి, నేతవానిపాలెం,ఐయితంపూడి,కేపీ అగ్రహారం గ్రామాల్లో పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విద్యార్థి మేలుకొపై అవగాహన కల్పించారు.

ప్రతి మహిళ ఆరోగ్యం కాపాడుకోవాలి

మాడుగుల : ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉంటేనే మంచి ఆరోగ్య సమాజ నిర్మాణం జరుగుతుందని, మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి. ఎర్రయ్యమ్మ అన్నారు. గురువారం స్థానిక దొర్లవీధిలో సర్పంచ్ ఎడ్ల కళావతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధామంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) ప్రథమగర్భిణులకు అందజేస్తున్నామని, అర్హులైనవారు అంగన్వాడీ కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో 120 మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అంతకుముందు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకుకూరలు, బాలామృతం పిండితో తయారు చేసిన వంటకాల ప్రదర్శనను పరిశీలించారు. మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, వైఎస్ఆర్‌సీపీ నాయకుడు ఎడ్ల హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పౌష్టికాహారం తీసుకోవాలని కింతలి వల్లాపురం సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి అన్నారు. స్వస్థ్‌నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో గురువారం 150 మంది మహిళలకు కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రొబ్బా సోముదొర వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, రొట్టెలు, మందులు సర్పంచ్ రాంబాయి, వైద్యాధికారి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఎ.కోడూరులో గురువారం స్వస్థ్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంను నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శశి ప్రియాంక ఎ.కోడూరు, పాడుగుపాలెం, కొత్తూరు గ్రామాలకు చెందిన 267 మంది మహిళలకు వైద్య పరీక్షలను జరిపి ఉచితంగా మందులను అందించారు. బ్రెస్ట్ క్యాన్సర్, నోటి క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పీహెచ్ఎన్ ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్, సర్పంచ్ అక్కునాయుడు, ఎంపీటీసీ గౌతమి, శంకరరావు, ఉప సర్పంచ్ దేముళ్లు పాల్గొన్నారు.

రోలుగుంట : కొవ్వూరు గ్రామంలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి మజీదా బేగం మహిళలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి నుంచి వచ్చి వైద్యాధికారి ఎల్.వి.ప్రసాద్ తన సేవలందించారు. సర్పంచ్ కాంతమ్మ పాల్గొన్నారు.

దేవరాపల్లి: కాశీపురంలో దేవరాపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డి.వనజ, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి గ్రీష్మ వైద్య సేవలందించారు. 301 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.మహిళలకు క్యాన్సర్ స్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు.

రావికమతం : కొత్తకోట పంచాయితీ కార్యాలయం వద్ద గురువారం మహిళలకు కొత్తకోత పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు అందజేసారు. మహిళలకు మధుమేహం,బీపీ, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని రావికమతం ఎంపీడీవో మహేష్ పరిశీలించారు. అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్స్‌ను తిలకించారు. సర్పంచ్ లోవరాజు,ఉప సర్పంచ్ పందల దేవ, ఎంపీటీసీలు పూడి దేవ,కుంచా శంకరరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : వ్యాధులు సంక్రమించిన వారు నిర్లక్ష్యం చూపకుండా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని తురకలపూడి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు సంధ్యారాణి సూచించారు. గురువారం ఆస్పత్రిలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. స్త్రీలలో వస్తున్న పలు రకాల క్యాన్సర్, గుండె సమస్యలు, మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. సర్పంచ్ గోవింద, మాజీ సర్పంచ్ గంట్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.



పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న సర్పంచ్ కళావతి, పీవో ఎర్రయ్యమ్మ



కింతలి వల్లాపురంలో గర్భిణులకు రొట్టెలు, మందులు అందజేస్తున్న సర్పంచ్ రాంబాయి తదితరులు

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

బుచ్చెయ్యపేట : రాజాం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ రాజు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలన్నారు.

దేవరాపల్లి : దేవరాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఎలక్ట్రికల్ ఏఈఈ కె. శంకరరావు తెలిపారు. మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున దేవరాపల్లి, పినకోట, తారువ, పెదనందిపల్లి, ఫీడర్ల పరిధిలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

చీడికాడ : మండలంలో తురువోలు 11 కేవీ, కోనాం 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు నర్సీపట్నం డివిజన్ ఆపరేషన్ విద్యుత్ ఈఈ ఎ.వి.ఎన్.ఎం. అప్పారావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

జీవన ఎరువుల వినియోగంపై శిక్షణ

రోలుగుంట: వ్యవసాయశాఖ, ఆత్మ సంయుక్తంగా జానకీరాంపురం గ్రామంలో గురువారం జీవన ఎరువుల వినియోగంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నర్సీపట్నం వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీదేవి, మండల వ్యవసాయాధికారి చిరంజీవి మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగం వల్ల రానురాను భూసారం తగ్గిపోతుందన్నారు. రైతులు జీవన ఎరువుల వినియోగించి భూసారం పెంచుకోవాలన్నారు. నత్రజనిని అందించే అజోస్పైరిలం, అసిటోబాక్టర్ అజల్లా భాస్వరాన్ని అందించే ఫాస్పరస్ సాల్యుబలైజింగ్, బ్యాక్టీరియా, పొటాస్ అందించే రిలీజింగ్ బ్యాక్టీరియా ఏ విధంగా వాడాలో రైతులకు అవగాహన కల్పించారు. ఆత్మ బీటీఎం లక్ష్మీ కిశోర్, సర్పంచ్ కృష్ణంనాయుడు, ఎంపీటీసీ ముసిలినాయుడు పాల్గొన్నారు.

స్టేడియంలో శ్రమదానం



స్టేడియంలో శ్రమదానం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, సిబ్బంది. వాకర్స్‌క్లబ్ సభ్యులు

నర్సీపట్నం : ఏక్ దిన్ ఏ గంట ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా పురపాలక అధికారులు, సిబ్బంది, వాకర్స్ క్లబ్ భాగస్వామ్యంతో గురువారం గంట పాటు శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ జంపా సురేంద్ర మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలు, స్వచ్ఛంద సేవకులు, అధికారులు సామూహిక శ్రమదానంలో పాల్గొని మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. అనంతరం చీపుర్లు పట్టి మున్సిపల్ స్టేడియం పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కార్యకర్తల సేవలు ఎంతో కీలకం



పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు

నాతవరం : అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కార్యకర్తల సేవలే కీలకమని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. నాతవరం గ్రామ సచివాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పౌష్టికాహార ఉత్పత్తులు ప్రదర్శన గురువారం ఏర్పాటు చేశారు. స్టాళ్లను అధికారులు ప్రజాప్రతినిధులు తిలకించి వాటిలో విటమిన్లు పోషకాలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు అప్పల నర్స, సర్పంచ్ గొలగాని రాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయలక్ష్మి, మాజీ ఎంపీపీలు కొండబాబు, నేతల విజయకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పోతురాజు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



గ్రీన్ అంబాసిడర్లను సత్కరిస్తున్న సర్పంచ్ గురువునాయుడు, ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల్

మాడుగుల: గ్రామాల్లో చెత్తా చెదారం, మురుగు నీటి నిల్వలు లేకుండా జాగ్రతలు తీసుకుంటే రోగాలు దరి చేరవని, ఇన్‌చార్జి ఎంపీడీవో జి.వి.ఎస్. గోపాల్ అన్నారు. గురువారం మండలంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు చేపట్టి గ్రీన్ అంబాసిడర్‌లను దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. స్వచ్ఛతపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ జవ్వాది వరహాలు, కూటమి నాయకులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా చెత్తను తొలగించారు. గ్రామాల్లో చెత్తను సేకరించే గ్రీన్ అంబాసిడర్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చాయాసుధ, డిప్యూటీ ఎంపీడీవో మేరీజోన్స్, కార్యదర్శులు పాల్గొన్నారు.